నేటిపత్రిక
PRGI Regd. No : APTEL/26/A0819
# ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 82 | 07 మంగళవారం, జూలై 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## విలేకరులు కావలెను.
నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను
సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256



## గిరిజన ప్రాంతాల్లోనూ
# అన్న క్యాంటీన్లు
02

### పబ్లిక్ గ్రీవెన్స్ సమస్యలు తక్షణం పరిష్కరించాలి
### అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు

## రూ.500 కోట్ల సాస్కి నిధులతో
# గురుకుల భవనాలు
### అదనంగా మరో 10 కొత్త బీసీ గురుకులాల ఏర్పాటు
### బిసి సంక్షేమశృాఖ మంత్రి సవిత వెల్లడి

**అమరావతి,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి సవిత చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 109 గురుకులాలకు అదనంగా మరో 10 కొత్త బీసీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీ విద్యార్థులకు నీట్, ఐఐటీ ప్రవేశాల కోసం టేకులోడు, సింహాచలంలో రెండు ఎక్సలెన్స్ సెంటర్ల ఏర్పాటు చేస్తామన్నారు. బీసీ సంక్షేమానికి తొలి మూడు బడ్జెట్లలో వరుసగా రూ.39 వేల కోట్లు, రూ.47 వేల కోట్లు, రూ.51 వేల కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించిందని మంత్రి సవిత తెలిపారు. మిగతా 2లో...





## దక్షిణ కొరియా పర్యటలనో లోకేశ్
### పెట్టుబుడల కోసం పలువురితో వరుస భేటీలు

**అమరావతి,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

దక్షిణ కొరియా పర్యటనలో ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ బిజీబిజీగా ఉన్నారు. ఏపీలో పెట్టుబడులే లక్ష్యంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వరుసగా భేటీ అయి చర్చలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా షూఆల్స్ ఛైర్మన్ లీ చియాంగ్-గెన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. మిగతా 2లో...

## కనకదుర్గమ్మకు భారీగా ఆదాయం
### హుండీ లెక్కింపులో రూ.3 కోట్లపైగా నగదు రాక

**విజయవాడ,జూలై6ప్రజా సీమ**

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం లో హుండీ ఆదాయం భారీగా వచ్చింది. హుండీల ద్వారా రూ.3 కోట్ల 39 లక్షల 53 వేల 599లు ఆదాయం సమకూరింది. అలాగే 568 గ్రాముల బంగారం, 3 కిలోల 330 గ్రాముల వెండితో పాటు వివిధ దేశాలకు చెందిన విదేశీ కరెన్సీని కూడా భక్తులు సమర్పించారు. మిగతా 2లో...

## అభివృద్ధికి అడ్డుపడితే గుణపాఠం తప్పదు
### వైసిపికి మంత్రి నారాయణ హెచ్చరిక

**నెల్లూరు,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**



ఏపీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అడ్డుపడితే ప్రజలు సహించరని.. మంచిని చెడుగా చూపిస్తే, ప్రజలు తగిన గుణ పాఠం చెబుతారని పురపాలక శృాఖ మంత్రి నారాయణ హెచ్చరిం చారు. సోమవారం నెల్లూరులో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మల్లెల సంజీవయ్య హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా 2లో...

## ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులపై నిషేధం
### 13నుంచి అమలుకు ఎపి ప్రభుత్వం నిర్ణయం

**అమరావతి,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

ఏపీ ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, బదిలీలపై నిషేధానికి అమలు తేదీ ఖరారైంది. మిగతా 2లో...

## ఎపిలో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు
### ప్రమాణం చేయించిన ప్రధాన న్యాయమూర్తి లీసాగిల్



**అమరావతి,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా నియమితులైన సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తమ్ కుమార్ చింతలపూడి అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం మిగతా 2లో...

## ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు లక్ష ఉద్యోగాలు
### ఎపి లక్ష్యం ఇదేనని వెల్లడించిన మంత్రి లోకేశ్



**అమరావతి,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. సోమవారం దక్షిణ కొరియాలో సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ స్టార్టప్ ఫౌండర్లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొని మాట్లాడారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి కొరియన్ స్టార్టప్‌లకు ఆహ్వానం పలికారు. భారతదేశ ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని చెప్పుకొచ్చారు. అమరావతి కేంద్రంగా ఆర్టీఐహెచ్.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, అనంతపురంలో ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు.

## పెట్టుబడుల కోసం లైజన్ అధికారుల నియామకం
### వివిధ దేశాలకు ప్రతినిధులుగా నలుగురికి బాధ్యతలు
### ఉత్తర్వులు జారీచేసిన ఎపి ప్రభుత్వం

**అమరావతి,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

ఏపీ ప్రభుత్వం కోసం లైజన్, స్పెషల్ రిప్రజెంటేటివ్‌ల నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉత్తర అమెరికాలో పెట్టుబడుల కోసం ప్రిన్సిపల్ లైజన్‌గా సతీశ్ మండువని ప్రభుత్వం నియమించింది. పశ్చిమాసియా, ఇతర దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా రాధాకృష్ణ రావిని నియమించింది. యూరప్‌కు ప్రత్యేక ప్రతినిధిగా జయకుమార్ గుంటుపల్లి నియమించింది. ప్రపంచంలోని మిగిలిన దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా శ్రీనివాస్ పల్లపోతు నియమించింది. విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ సమన్వయానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధులను నియమించింది. జీఓ ఆర్టీ నంబర్ -1333 ద్వారా ఈ నియామకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ, అంతర్జాతీయ అనుసంధానంపై ఏపీ ప్రభుత్వం దృష్టి సారించింది.

## ఎపిలో విలేజ్ మార్ట్‌ల ఏర్పాటు
### మార్కెట్ ధరలకన్నా తక్కువగా సరుకుల విక్రయం
### ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రారంభించిన మంత్రి నాదెండ్ల



**గుంటూరు,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

గ్రామాల్లో విలేజ్ మార్ట్‌లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరకే నిత్యావసరాల అమ్మకాలు జరగనున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గం లాల్‌పురంలో పైలట్ ప్రాజెక్ట్‌ను ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మీడియాతో మాట్లాడారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రస్తుతం ఒక్కరోజే 7 విలేజ్ మార్ట్‌లు ప్రారంభించామని తెలిపారు. జగన్ హయాంలో రాష్ట్రంలోని 29,750 రేషన్ షాపులను పూర్తిగా నిర్వీర్యం చేశారని మంత్రి నాదెండ్ల మండిపడ్డారు. గ్రామీణ రేషన్ వ్యవస్థలో కార్పొరేట్ తరహా సంస్కరణలు తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా రేషన్ షాపులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. మిగతా 2లో...

## పేర్ని నానిలా పార్టీలు మారలేదు
02
### మంత్రి సత్యకుమార్ కౌంటర్

ప్రజాసీమ

మొదటిపేజీ తరువాయి

# ఎపిలో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో కేంద్ర న్యాయశాఖ అధికారిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నియామకాలతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 29 నుంచి 32కు పెరిగింది. హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన అదనపు న్యాయమూర్తులకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ శుభాకాంక్షలు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు.. లక్ష ఉద్యోగాలు

ఇప్పటికే 2,500కు పైగా స్టార్టప్‌లకు ఆర్టీఐహెచ్ మద్దతు ఇచ్చిందని వివరించారు. 5,200 మందికి పైగా వ్యవస్థాపకులకు ఇన్నోవేషన్ హబ్ భాగస్వామ్యం కల్పించిందని వెల్లడించారు. స్టార్టప్‌లకు సీడ్ ఫండ్, డీప్ టెక్ గ్రాంట్లు, పెట్టుబడి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. భాగస్వామ్యంతో డీప్ టెక్ ఏంజెల్ ఫండ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇండియా-కొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దామని మంత్రి లోకేశ్ సూచించారు. కొరియన్ కంపెనీల కోసం ప్రత్యేక 'కొరియా డెస్క్' ఏర్పాటుకు ప్రతిపాదన చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టార్టప్‌లకు కొరియా మార్కెట్.. కొరియా స్టార్టప్‌లకు భారత్ మార్కెట్ ఉంటుందని చెప్పుకొచ్చారు. లాజిస్టిక్స్, ఫిన్‌టెక్, డీప్‌టెక్, అడ్వాన్స్‌డ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. అమరావతిలో దేశ తొలి క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీలో 133 క్యూబిట్ ఎఃఓ క్వాంటం సిస్టమ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌తో స్టార్టప్‌లకు భారీ కంప్యూటింగ్ సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

# పేర్ని నానిలా పార్టీలు మారలేదు

## మంత్రి సత్యకుమార్ కౌంటర్

**అనంతపురం,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్నినానిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పేర్ని నాని చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకుంటారంటూ వ్యాఖ్యానించారు. 'నేను పార్టీలు మారే అవకాశవాదిని కాదు.. నాని అవకాశం కోసం పార్టీలు మారుతాడు. నా రక్తంలోనే కాషాయం ఉంది. ఒక మంత్రిగా ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకోను అని హెచ్చరించారు. జగన్‌ను నేను వ్యక్తిగతంగా ఎప్పుడూ తిట్టలేదు.. ఆయన వ్యతిరేక సిద్ధాంతాలపైనే మాట్లాడుతాను. సంకీర్ణ ప్రభుత్వంలో నేను మంత్రిని' అని చెప్పుకొచ్చారు. జగన్ ఒక నిలకడ లేని మనిషి అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతి తొందర్లోనే పూర్తి అవుతుందన్నారు. రాజధానిపై జగన్ మాట్లాడటం చూస్తే అవగాహనా లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో గవర్నమెంట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కొన్ని చోట్ల మార్పు రావాల్సి ఉందని.. దానిపై కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రజల నుంచి వస్తున్న ప్రతి ఫిర్యాదుపైనా చర్యలు తీసుకుంటున్నామని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# దక్షిణ కొరియా పర్యటనలో లోకేశ్

ఏపీలో ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని షూఆల్స్‌కు మంత్రి ఆహ్వానం పలికారు. ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. మంత్రి లోకేశ్ విజ్ఞప్తిపై షూఆల్స్ ఛైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ.. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్నారు. ఏపీలో రూ.300 కోట్లతో షూఆల్స్ యూనిట్ ఏర్పాటు కానుంది. దీని ద్వారా 3 వేల మందికి ఉపాధి లభించనుంది. సోలమ్ గ్రూప్ గ్లోబల్ ఆపరేషన్స్ ఆఫీసర్ జీగాబ్ హాతో మంత్రి భేటీ అయ్యారు. శ్రీసిటీలో సోలమ్ యూనిట్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీసిటీలో ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్ తయారీ విస్తరణకు మంత్రి ఆహ్వానించారు. శ్రీసిటీ ఎ÷-లాంట్ పనులు వేగవంతం చేస్తామని సోలమ్ సంస్థ పేర్కొంది. రూ.338 కోట్లతో శ్రీసిటీలో సోలమ్ ఈవీ ఛార్జర్ యూనిట్ నిర్మాణం జరగనుంది. ఆపై సాఫ్ట్-ఈపీఐ సీఈవో సుంగ్ మిన్ హ్వాంగ్, సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ ఇన్-సుంగ్ చోతో మంత్రి సమావేశమయ్యారు. ఏపీలో మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తిరుపతి ఐఐటీ సహకారంతో అడ్వాన్స్‌డ్ ఎపిటాక్సీ సెంటర్‌కు ఆహ్వానం పలికారు. ఏటా 500 మంది టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చే అకాడమీ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఈ సందర్భంగా సాఫ్ట్-ఈపీఐ సీఈవో తెలిపారు. కొరియా పర్యటనలో పెట్టుబడుల ఆకర్షణపైనా మంత్రి లోకేశ్ దృష్టి సారించారు.

మొదటిపేజీ తరువాయి

# మత్స్యకారుల గల్లంతుపై డిప్యూటీ సీఎం ఆందోళన

## గాలింపు చర్యలు ముమ్మరం చేయాలిన పవన్ ఆదేశం

**అమరావతి,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

విశాఖ హార్బర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. సముద్రంలో మత్స్యకారుల గల్లంతుపై ఆరా తీశారు. విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెరైన్ పోలీసులు, కోస్టు గార్డు, నేవీ సహకారం తీసుకోవాలని సూచించారు. గల్లంతైన మత్స్యకారులను రక్షించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని.. ఆందోళన చెందవద్దని వారి కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. భోగాపురం మత్స్యకారులు గల్లంతుపై విజయనగరం, విశాఖ కలెక్టర్లు రామ్ సుందర్‌రెడ్డి, అభిషిక్త్ కిషోర్‌తో మంత్రి కొండపల్లి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మత్స్యకారులను రక్షించేందుకు చేపట్టిన చర్యలను మంత్రికి వివరించారు కలెక్టర్లు. గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల నాయకుడితో ఫోన్లో మాట్లాడినట్లు మంత్రికి, ఎంపీకి వివరించారు కలెక్టర్లు. ఏడుగురు మత్స్యకారుల్లో ఆరుగురికి లైఫ్ జాకెట్లు ఉన్నాయని.. ఒకరికి లైఫ్ జాకెట్ లేనట్లుగా చెప్పారు కలెక్టర్లు. నేవీ హెలికాప్టర్ల ద్వారా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినట్లుగా చెప్పారు కలెక్టర్లు. సముద్ర తీర ప్రాంతానికి దగ్గర్లోనే ఉండటంతో మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని మంత్రి తెలిపారు. మత్స్యకారులను సేఫ్‌గా తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ముమ్మరంగా గాలిస్తోందని మంత్రి కొండపల్లి, ఎంపీ కలిశెట్టి వివరించారు.

# రూ.500 కోట్ల సాస్కి నిధులతో గురుకుల భవనాలు

మొదటిపేజీ తరువాయి

**అమరావతి,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి సవిత చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 109 గురుకులాలకు అదనంగా మరో 10 కొత్త బీసీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీ విద్యార్థులకు నీట్, ఐఐటీ ప్రవేశాల కోసం టేకులోడు, సింహాచలంలో రెండు ఎక్స్‌లెన్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు.బీసీ సంక్షేమానికి తొలి మూడు బడ్జెట్లలో వరుసగా రూ.39 వేల కోట్లు, రూ.47 వేల కోట్లు, రూ.51 వేల కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించిందని మంత్రి సవిత తెలిపారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మూడో బ్జడెట్‌లో బీసీల సంక్షేమం కోసం రికార్డు స్థాయిలో రూ.51 వేల కోట్లు కేటాయించామన్నారు. ఆరు బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉన్నత విద్యకు అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రూ.26.71 కోట్లతో 62 ఎంజేపీ గురుకుల భవనాల మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, క్రీడా సామగ్రి, ట్రాక్‌సూట్లను అందజేస్తున్నామన్నారు. చెస్‌లో ప్రతిభ పెంపొందించేందుకు ఏపీ చెస్ అకాడమీతో ఎంవోయూ కుదుర్చుకున్నామని తెలిపారు. 998 బీసీ హాస్టళ్లలో 85 వేల మంది విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. రెండేళ్లలో రూ.80 కోట్లతో బీసీ హాస్టళ్ల మరమ్మతులు, మౌలిక వసతులను అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు. 772 హాస్టళ్లలో ఆర్వో ఎ÷-లాంట్లు, 642 హాస్టళ్లలో ఇన్వర్టర్లను ఏర్పాటు చేశామన్నారు. సివిల్స్, డీఎస్సీ, గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షలకు బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అనంతపురం, తిరుపతిలో మూడు ప్రత్యేక బీసీ స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రూ.1000 కోట్లతో ఆదరణ-3.0 అమలు చేసి బీసీలకు ఆధునిక పరికరాలను పంపిణీ చేస్తామన్నారు. బీసీల ఆత్మగౌరవం కోసం దేశంలోనే తొలి బీసీ రక్షణ చట్టాన్ని ప్రభుత్వం తీసుకురానుందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సవిత తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రెండేళ్లలో 117.68 లక్షల మంది లబ్దిదారులకు రూ.32,533.68 కోట్ల సహాయం అందించామన్నారు. గత ఐదేళ్ల కాలంలో గొడ్డలి పార్టీ అక్రమాలకు చట్టప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. రైజింగ్ రాయలసీమ.. సీఎం చంద్రబాబు నాయుడు నమ్మిన సిద్ధాంతమన్నారు. అన్ని రంగాల్లోనూ రాయలసీమను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేలా రేయింబవళ్లు కృషి చేస్తున్నారని తెలిపారు. హార్టికల్చర్, ఐటీ, పారిశ్రామిక, డిఫెన్స్, పర్యాటక , డ్రోన్ హబ్‌లుగా రాయలసీమను ముందంజలో నిలబెడుతున్నారని అన్నారు. గడిచిన రెండేళ్లలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల్లో దాదాపు మూడో వంతు అంటే రూ.85 వేల కోట్లకు పైగా పెట్టుబడులు రాయలసీమకే వచ్చాయని మంత్రి సవిత పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులపై నిషేధం

## 13నుంచి అమలుకు ఎపి ప్రభుత్వం నిర్ణయం

**అమరావతి,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

ఏపీ ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, బదిలీలపై నిషేధానికి అమలు తేదీ ఖరారైంది. జులై 13వ తేదీ నుంచి పోస్టుల సృష్టి, అప్‌గ్రేడేషన్‌పై ఏపీ ప్రభుత్వం నిషేధం అమలు చేయనుంది. కొత్త నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, డిప్యుటేషన్లపై నిషేధం విధించింది. స్థానిక కేడర్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు నిషేధం కొనసాగించనుంది. పీఓ-2025 అమలు నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక శాఖ (హెచ్‌ఆర్-ఎ÷-లానింగ్-పాలసీ) ఆధ్వర్యంలో ఈ మెమో జారీ చేసింది. కొన్ని శాఖల్లో కేడర్ కేటాయింపుల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో గడువు పొడిగించింది. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తితో నిషేధం అమలు తేదీపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. జులై 5వ తేదీతో ముగియాల్సిన ప్రక్రియకు అదనపు గడువు ఇచ్చింది. అన్ని శాఖలు ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్లు, శాఖాధిపతులు ఈ ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశించింది. స్థానిక కేడర్ల పంపిణీ పూర్తయ్యే వరకు పరిపాలనా చర్యలపై పరిమితులు ఉంటాయని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

మొదటిపేజీ తరువాయి

# కనకదుర్గమ్మకు భారీగా ఆదాయం

**విజయవాడ,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయం భారీగా వచ్చింది. హుండీల ద్వారా రూ.3 కోట్ల 39 లక్షల 53 వేల 599లు ఆదాయం సమకూరింది. అలాగే 568 గ్రాముల బంగారం, 3 కిలోల 330 గ్రాముల వెండితో పాటు వివిధ దేశాలకు చెందిన విదేశీ కరెన్సీని కూడా భక్తులు సమర్పించారు. 16 రోజుల హుండీ లెక్కింపును పరిశీలిస్తే రోజుకు సగటున రూ.21 లక్షల 23 వేల మేర అమ్మవారి హుండీ ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అమ్మవారి హుండీలను సోమవారం లెక్కించారు. ఈ కార్యక్రమం ఆలయ ఈవో శీనూ నాయక్ పర్యవేక్షణలో నిర్వహించారు. మొత్తం 16 రోజులకు సంబంధించిన హుండీలను లెక్కించగా భక్తులు సమర్పించిన విరాళాల ద్వారా భారీ ఆదాయం లభించింది. భక్తుల నుంచి వస్తున్న విరాళాలు కనకదుర్గమ్మపై ఉన్న అపారమైన విశ్వాసాన్ని చూపుతుందని పేర్కొన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పారదర్శకంగా పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. నగదు, బంగారం, వెండి రూపంలో భక్తులు సమర్పించిన కానుకలు ఆలయ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు వినియోగించనున్నట్లు సమాచారం. కనకదుర్గమ్మ దర్శనానికి రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో ఆలయ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతోంది. తాజాగా హుండీ లెక్కింపులో నమోదైన రూ.3.39 కోట్ల ఆదాయం ఆలయానికి భక్తుల నుంచి లభిస్తున్న విశేష ఆదరణకు నిదర్శనంగా నిలిచింది.

మొదటిపేజీ తరువాయి

# గిరిజన ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు

**అమరావతి,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గిరిజనులకు నాణ్యమైన భోజనం అందించాలన్నదే లక్ష్యమని అన్నారు. పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని వ్యాఖ్యానించారు. పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో జీరో వేస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ నుంచి వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.పురపాలక, పంచాయతీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై ఈ సమావేశంలో సీఎం చర్చించారు. విశాఖపట్నం సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏయే విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఏపీ అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్ - బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలని దిశానిర్దేశం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మూడు నెలల్లో యూఎల్‌బీల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారం ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని నిర్దేశిరచారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో స్పష్టమైన ఎస్‌ఓపీ జారీ చేయాలని ఆదేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏ మేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లోని టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# అభివృద్ధికి అడ్డుపడితే గుణపాఠం తప్పదు

## వైసిపికి మంత్రి నారాయణ హెచ్చరిక

**నెల్లూరు,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

ఏపీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అడ్డుపడితే ప్రజలు సహించరని.. మంచిని చెడుగా చూపిస్తే, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పురపాలక శృాఖ మంత్రి నారాయణ హెచ్చరించారు. సోమవారం నెల్లూరులో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మల్లెల సంజీవయ్య హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో మూసేసిన వీఆర్సీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పున: ప్రారంభించామని మంత్రి తెలిపారు. వీఆర్సీని తలదన్నేలా మరో 15 హైస్కూల్స్‌ను ఆధునికీకరిస్తున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని స్కూల్స్ సిద్ధం చేస్తామని వెల్లడించారు. వైసీపీ నేతలు వాటిపైనా విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ లబ్ధికోసం, ఉనికి కోసం జగన్ అండ్ కో ఆరోపణలు చేస్తే చెడ్డవారిగా మిగిలిపోతారని హెచ్చరించారు. పరిశుభ్రతతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. మంత్రి లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా నెల్లూరులో స్కూల్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# ఎపిలో విలేజ్ మార్ట్‌ల ఏర్పాటు

రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 1,000 మినీ మార్ట్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు. ఓపెన్ మార్కెట్ రేట్ల కంటే రూ.3 నుంచి రూ.4ల తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు, మిల్లెట్స్ పంపిణీ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతానికి 60 రకాల సరకులతో మీ మార్ట్‌లు ప్రారంభించినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో 250 రకాల వస్తువులు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. విలేజ్ మార్ట్‌ల్లో కూడా త్వరలోనే డిజిటల్ పేమెంట్స్ అవకాశం కల్పిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# పోలవరం సముద్ర తీరంలో మత్స్యకారుల గల్లంతు

## నేవీ, కోస్ట్ గార్డు అధికారులతో మంత్రి అచ్చన్న సమీక్ష

**అమరావతి,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

అనకాపల్లి జిల్లా ఎస్ రాయవరం మండలం రేవు పోలవరం సముద్ర తీరంలో పడవ బోల్తా ఘటనలో మత్స్యకారుల గల్లంతుపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించారు. సోమవారం గల్లంతైన మత్స్యకారుల గాలింపు చర్యలపై నేవీ, కోస్ట్ గార్డు అధికారులతో సమావేశమై చర్చించారు. గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి వచ్చేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రెండో రోజూ ప్రత్యేక నౌక, రెస్క్యూ బోటు, హెలికాప్టర్‌తో నేవీ, కోస్ట్ గార్డు సంయుక్త గాలింపు కొనసాగుతోందని మంత్రికి అధికారులు తెలిపారు. కారి చిన్న ఇచ్చిన సమాచారం ఆధారంగా మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం గాలింపు కొనసాగిస్తున్నామన్నారు. కారి చిన్నను విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు కోస్ట్ గార్డు తీసుకురానుంది. గల్లంతైన వారిలో కారి గంగయ్య, అమర అప్పలరాజు, కారి సితోడు, మేడ చిన అమ్మోరు, కారి చిన్నయ్య, రాగుతూ బండియ్యలు ఉన్నారు.

# దలైలామా దీర్ఘాయుష్షుతో జీవించాలి

## ఎక్స్‌లో చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు

**అమరావతి,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

టిబెట్‌కు చెందిన బౌద్ధ మత గురువు దలైలామా పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దలైలామాకు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్మ కలగాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్ట్ చేశారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల కోసం దలైలామా కృషి ప్రశంసనీయమని కొనియాడారు. 'శాంతి, కరుణ, మానవత్వానికి దలైలామా ప్రతీక. దశాబ్దాలుగా ప్రపంచాన్ని ప్రేరేపిస్తున్న మహోన్నతుడు దలైలామా. దయ, జ్ఞానం, అహింసను ఆచరించాలని దలైలామా సందేశం ఇచ్చారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల కోసం దలైలామా కృషి ప్రశంసనీయం. దలైలామాకు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్మ కలగాలి. శాంతి, కరుణ వ్యాప్తి చేసే దలైలామా సేవలు చిరస్మరణీయం. దలైలామా తన మహోన్నత సేవలను మరింత కాలం కొనసాగించాలి' అని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల పోరాట యోధుడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'సామాజిక న్యాయ సాధనకు, బడుగు బలహీన వర్గాల సాధికారతకు, సమాన అవకాశాలు కలిగిన సమసమాజ నిర్మాణానికి జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్. దేశ వ్యవసాయ రంగంలో హరిత విప్లవానికి బలమైన పునాది వేసి, ఆహార భద్రత సాధనలో విశిష్ట పాత్ర పోషించిన దూరదృష్టి గల నాయకుడు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్ఫూర్తిదాయక సేవలను స్మరించుకుంటూ ఘన నివాళు లర్పిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

ప్రజాసీమ

# ఆదిత్యలో ఘనంగా ప్రారంభమైన పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధి శిక్షణ

## - హాజరైన కళాశాల,పారిశ్రామిక ప్రముఖులు






**మదనపల్లె (ప్రజా సీమ) :**

పుంగనూరు రోడ్డులోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సెమినార్ హాల్--114లో 20 రోజుల (ఎంఎస్ఎంఈ రాంప్) పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది.కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ),ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ),కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఏఐ) మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ (ఏఐ అండ్ డీఎస్) విభాగాల నుండి ఎంపిక చేయబడిన చివరి సంవత్సరం బి.టెక్ విద్యార్థుల సాంకేతిక సామర్థ్యాలను మరియు పరిశ్రమ సంసిద్ధతను పెంపొందించడానికి,ఈ కార్యక్రమాన్ని లార్ ఐటీ క్లౌడ్ సొల్యూషన్స్ సహకారంతో నిర్వహిస్తున్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగ రెడ్డి,ప్రిన్సిపాల్ డాక్టర్ రాయుడు పెయ్యాల,పారిశ్రామిక ప్రోత్సాహక అధికారి శ్రీ నాగార్జున కొప్పాల,లారెఐటి క్లౌడ్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు అండ్ సీఈఓ శ్రీ శివ నాగ తేజ మరియు విశిష్ట వనరుల వ్యక్తులు సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ బాబు కొత్తచెరువు షేక్ మరియు ఏఐ వ్యూహం అండ్ సాంకేతికత డైరెక్టర్ షేక్ సమీర్ హాజరయ్యారు.సభకు స్వాగతం పలుకుతూ,ఏఐ అండ్ డీఎస్ విభాగం ప్రొఫెసర్ అండ్ హెడ్ డాక్టర్ ఆర్.మహమ్మద్ షఫీ,ఎంఎస్ఎంఈ ర్యాంప్ పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం యొక్క లక్ష్యాలను మరియు ప్రాముఖ్యతను పరిచయం చేశారు.అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ,ఆచరణాత్మక అనుభవం,ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసాన్ని అందించడం ద్వారా విద్యాభ్యాసానికి,పరిశ్రమ అంచనాలకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చడానికి ఈ కార్యక్రమం రూపొందించబడిందని ఆయన నొక్కి చెప్పారు.విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ డాక్టర్ రాయుడు పెయ్యాల,నాగార్జున కొప్పాల,మరియు శివ నాగ తేజ పరిశ్రమకు సంబంధించిన నైపుణ్యాలను సంపాదించుకోవాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.శిక్షణను చిత్తశుద్ధి,క్రమశిక్షణ,అంకితభావంతో పొందాలని పాల్గొనేవారిని ప్రోత్సహించారు. ఇలాంటి కార్యక్రమాలు ఉపాధి అవకాశాలను గణనీయంగా మెరుగుపరుస్తాయని,అలాగే టెక్నాలజీ పరిశ్రమ యొక్క మారుతున్న అవసరాలను తీర్చడానికి విద్యార్థులను సిద్ధం చేస్తాయని వారు నొక్కి చెప్పారు.ఎంపికైన విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.దీంతో 20 రోజులపాటు జరిగే ఈ తీవ్రమైన అభ్యాసం,ఆవిష్కరణ మరియు వృత్తి నైపుణ్యాభివృద్ధి ప్రయాణం ప్రారంభమైంది.ఈ శిక్షణ ద్వారా పాల్గొనేవారికి ఆచరణాత్మక జ్ఞానం,సాంకేతిక నైపుణ్యం మరియు పరిశ్రమ అనుభవం లభించి,తద్వారా వారి కెరీర్ అవకాశాలు మరియు ఉద్యోగ నియామకానికి సంసిద్ధత బలపడతాయని ఆశిస్తున్నారు.

# మర్రిపాడు మండలంలో 'సర్ ' కార్యక్రమం పరిశీలన: త్వరితగతిన పూర్తి చేయాలని

## -టిడిపి రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి సూచించారు





**ఆత్మకూరు( ప్రజా సీమ)**

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలం బుధాడ, కృష్ణాపురం, తిమ్మయ్యగారి పల్లి ,గ్రామాల్లో "సర్" కార్యక్రమాన్ని నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఆఫీసర్ (దీూా) ఆంజనేయ రెడ్డితో కలిసి ఓటర్ల నమోదు, వెరిఫికేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.?పార్టీ ఆదేశాల ప్రకారం ఓటర్ల జాబితా సవరణ, నమోదు వివరాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని నాయకులు ఈ సందర్భంగా అధి కారులకు, కార్యకర్తలకు సూచించారు.?ఓటర్ల పరిశీలన వివరాలు:బుధాడ, పరిధిలో మొత్తం 646 "సర్" పత్రాలను పరిశీలించాల్సి ఉండగా, అందులో ఇప్పటివరకు 480 పత్రాల ప్రక్రియ పూర్తయింది.పూర్తయినవి: 480 మరణించిన వారు: 80 మందిని గుర్తించారు. పరిధిలో మొత్తం మిగిలినవి: ఇంకా 160 మందికి సంబంధించిన వివరాలను త్వరలోనే పూర్తి చేయాల్సి ఉంది.కృష్ణాపురం మర్రిపాడు మండలంలో 'సార్' కార్యక్రమం పరిశీలన: త్వరితగతిన పూర్తి చేయాలని శనివారపు మోహన్ రెడ్డి చూపించారు మర్రిపాడు (ఆత్మకూరు నియోజకవర్గం): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలం బుధాడ, కృష్ణాపురం గ్రామాల్లో 'సార్' (ూ×=) కార్యక్రమాన్ని నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఆఫీసర్ (దీూా) ఆంజనేయ రెడ్డితో కలిసి ఓటర్ల నమోదు, వెరిఫికేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.పార్టీ ఆదేశాల ప్రకారం ఓటర్ల జాబితా సవరణ, నమోదు వివరాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని నాయకులు ఈ సందర్భంగా అధికారులకు, కార్యకర్తలకు సూచించారు. ఓటర్ల పరిశీలన వివరాలు:బుధాడ, కృష్ణాపురం, తిమ్మయ్య గారి పల్లె పరిధిలో మొత్తం 646 సార్ పత్రాలను పరిశీలించాల్సి ఉండగా, అందులో ఇప్పటివరకు 480 పత్రాల ప్రక్రియ పూర్తయింది.పూర్తయినవి: 480 మరణించిన వారు: 80 మందిని గుర్తించారు. కృష్ణాపురం వివరాలు ఎస్ ఐ ఆర్ మొత్తం 12 70 అందులో 730 పూర్తి అయినయి 50 డెత్ మిగిలినవి పూర్తి చేయాల్సి ఉంది. తిమ్మగారి పల్లి గ్రామం ఎస్ఐఆర్ మొత్తం 446మిగిలినవి: ఇంకా 160 మందికి సంబంధించిన వివరాలను పూర్తి చేయాల్సి ఉంది కృష్ణాపురం ూ×= మొత్తం 1270 పూర్తి అయినవి 730, డెత్ 50,మిగిలినవి పూర్తి కావలసింది. పాల్గొన్న ముఖ్య నాయకులు:ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు శనివారపు మోహన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సయ్యద్ జవహర్ భాష, మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు పిచ్చిరెడ్డి, బత్తిన వెంకటయ్య, సిద్ధవటం టిడిపి నాయకులు, స్థానిక కార్యకర్తలు మరియు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెండింగ్ ఇంజనీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

## – జలధార పనులు ఆగస్టు 7లోగా పూర్తి చేయాలి- అధికారులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశం





**మదనపల్లె (ప్రజా సీమ) :**

జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి,నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు.సోమవారం మదనపల్లి కలెక్టరేట్ లోని కోర్టు హాలులో పంచాయతీరాజ్,గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), ఇరిగేషన్,ఉపాధి హామీ, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి,ట్రాన్స్కో,ఏపీ ఎస్పీడీసీఎల్ తదితర ఇంజనీరింగ్ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల్లో ఇంకా ప్రారంభం కాని పనులపై ప్రత్యేక దృష్టి సారించి వాటి స్థితిగతులను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న అన్ని పనులకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,బీటీ మెటీరియల్ సరఫరాలో జాప్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన సామగ్రిని సమకూర్చు కోవాలని అధికారులకు సూచిం చారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాలను ప్రాధాన్యత ఆధారంగా వర్గీకరించి, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసు కోవాలన్నారు. అలాగే జాతీయ ఆరోగ్య మిషన్,15వ ఆర్థిక సంఘం తదితర నిధులతో నిర్మిస్తున్న ఆరోగ్య కేంద్రాల భవనాలు,రాయచోటిలో నిర్మాణం లో ఉన్న వన్ స్టాప్ సెంటర్,మదనపల్లిలో ప్రతిపాదిత జిల్లా పంచాయతీరాజ్ రిసోర్స్ సెంటర్ (డీపీఆర్‌సీ) భవన నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు.డీపీఆర్‌సీ భవనంలో సుమారు 200 మందికి సరిపడే సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.గ్రామీణ నీటి సరఫరా శాఖ పనులపై సమీక్షిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలను స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పూర్తి చేయాలని,కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను ఆగస్టు నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలో ఎక్కడైనా తాగునీటి సమస్యలు తలెత్తితే వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని,నీటి రవాణా మొత్తం ఆన్‌లైన్ ట్రాకింగ్ విధానంలో నిర్వహించి నివేదికలు సమర్పించాలని సూచించారు.గ్రామీణ నీటి సరఫరా గ్రిడ్‌కు సంబంధించిన భూసేకరణ,ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఇరిగేషన్ శాఖ పనులపై సమీక్షిస్తూ జలధార-100 రోజుల కార్యక్రమం కింద జిల్లాలో చేపట్టిన అన్ని పనులను ఆగస్టు 7లోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ నెల 8లోగా అన్ని పనులకు సంబంధించిన ఒప్పందాలు పూర్తి చేసి వెంటనే గ్రౌండింగ్ చేపట్టాలని,పూర్తయిన పనులకు ఎం-బుక్ నమోదును పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. తక్కువ వర్షపాతం నమోదైన కరువు ప్రభావిత మండలాల్లో చేపట్టిన నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత నివ్వాలని చెప్పారు.ప్రతి డివిజన్‌కు చెందిన డీఈలు తమ పరిధిలోని పనుల పురోగతిపై సమగ్ర స్థితిగతుల నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఉపాధి హామీ పథకం కింద మదనపల్లి మండలంలో ప్రగతిలో ఉన్న 29 సప్లై ఛానల్ పనులను ఈ నెల 10లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జాతీయ రహదారులు,ఆర్ అండ్ బి,ట్రాన్స్కో, ఏపీ ఎస్పీడీసీఎల్ శాఖల పరిధిలో చేపట్టిన పనులు,పూర్తయిన పనులు, ప్రగతిలో ఉన్న పనులపై సమీక్షించి,నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.ఈ సమావేశంలో వివిధ ఇంజనీరింగ్ శాఖల జిల్లా అధికారులు,సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవోపేతంగా హేమంత్,ఆషితల వివాహం

## - శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు,శ్రేయోభిలాషులు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

వైఎస్ఆర్సిపి మేధావుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మయూరి రఘునాథరెడ్డి కుమార్తె ఆషిత,హేమంత్ ల వివాహ వేడుక అమెరికాలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది.ముందుగా మెహందీ ఫంక్షన్ సందడిగా,ముహూర్తం సాంప్రదాయ బద్ధంగా జరిగాయి.బంధుమిత్రులు,శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.మదనపల్లి నియోజకవర్గం వైసీపీలో రఘునాథ్ రెడ్డి క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి,మదనపల్లె వైకాపా సమన్వయకర్త నిసార్ అహ్మద్,ఇతర పార్టీ ప్రముఖులతో ఆయన సత్సంబంధాలు కలిగి ఉన్నారు.ఆయన సమర్థతను గుర్తించి పార్టీ అధిష్టానం ఇటీవల మేధావుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది.పార్టీ బలోపేతానికి,కార్యకర్తల శ్రేయస్సు కోసం అలుపెరగని కృషి చేస్తున్నారని పలువురు ప్రశంసించారు.కాగా మయూరి రఘునాథరెడ్డికి ఆయన కుమార్తె వివాహ వేడుకను పురస్కరించుకొని చరవాణిల ద్వారా పలువురు వైసిపి నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మయూరి రఘునాథరెడ్డి మాట్లాడుతూ తన కుమార్తెకు వివాహ శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు,కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని,అమెరికాలో వివాహం జరుగుతున్న కారణంగా తిరిగి స్వదేశానికి వచ్చిన అనంతరం అందరికీ విందు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.





# ఎంపీ మిథున్ రెడ్డికి చేరిన మదనపల్లె ఎస్ఐఆర్ నివేదిక

## - సమర్పించిన వైకాపా సమన్వయకర్త ఎస్.నిసార్ అహమద్

**మదనపల్లె (ప్రజా సీమ) :**

రాజంపేట పార్లమెంట్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి మదనపల్లె ఎస్ఐఆర్ నివేదికను నియోజకవర్గం సమన్వయకర్త ఎస్.నిసార్ అహమద్ సమర్పించారు.సోమవారం సదుం మండలం లోని యర్రాతివారిపల్లెలో మాజీ మంత్రి,పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి,యువ పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డిని,తంబళ్లపల్లె శాసనసభ్యులు ద్వారకానాథ రెడ్డిని నిసార్ అహమద్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఇందులో భాగంగా మదనపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు సంబంధించి సమగ్ర నివేదికను ఎంపీ మిథున్ రెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యేందుకు సమయం చాలా తక్కువగా ఉన్నందున డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేలా సంబంధిత అధికారులకు పార్టీ నాయకులు,బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలన్నారు.ఎవరు ఓటు హక్కును కోల్పో కుండా అప్రమత్తంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.రెడ్డి,మదనపల్లె మండల కన్వీనర్ డి.కరుణాకర్ రెడ్డి,పార్టీ నాయకులు మొహమ్మద్ యూనస్ తదితరులు పాల్గొన్నారు.





ప్రజాసీమ

# తోక వారి వివాహ వేడుకలలో టిడిపి నాయకులు

సిద్ధవటం ప్రజా సీమ

సిద్ధవటం మండలం వంతాటిపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం తోక వారి వివాహ వేడుకలలో పాల్గొనడం జరిగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆత్మకూరు నియోజకవర్గం పరిశీలకులు, శనివారపు మోహన్ రెడ్డి తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంతటి పల్లె గ్రామంలో తోక వెంకట సాయి వెడ్స్ ఆదిలక్ష్మి వారి వివాహానికి హాజరై వారిని ఆశీర్వదించడం జరిగింది అన్నారు ఈ కార్యక్రమంలో స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు, శ్రీ నిత్య పూజ స్వామి దేవస్థానం చైర్మన్, జంగిటి రాజేంద్రప్రసాద్ యాదవ్, సిద్ధవటం సింగల్ విండో అధ్యక్షులు, దారపునేని దశరథ రామానాయుడు, టిడిపి యువ నాయకులు , తుర్ర ప్రతాప్ నాయుడు, సిద్ధవటం ఐటీడీపీ అధ్యక్షులు , పెగడ హరి ప్రసాద్, మాధవరం గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి, మురళి రాయల్, సిలర్ సాబ్ తదితరులు పాల్గొన్నారు



# సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన టిడిపి ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు

సిద్ధవటం ప్రజా సీమ

దేశవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఎన్నికల సమగ్ర సర్వేలో భాగంగా ఆదివారం సిద్ధవటం మండలం పెద్దపల్లి గ్రామపంచాయతీ భాకరాపేట గ్రామంలోని స్వర్ణ సచివాలయం నందు మండల తహసిల్దార్ విజయ్ కుమార్, భాకరాపేట దీూా లతో మరియు గ్రామ టిడిపి నాయకులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ౹ా×= రిపోర్ట్ గురించి అడిగి తెలుసుకున్నారు. డిజిటలైజేషన్ పర్సంటేజ్ టెంటుకు అందరూ సహకరించాలని ఓటరుకు ఓటు భద్రత కల్పించవలసిన బాధ్యత మన మీద ఉందని ఇంచార్జ్ శ్రీ జగన్మోహన్ రాజు తెలియజేశారు. అదేవిధంగా మండలంలో 53% డిజిటల్జైజేషన్ జరగడం వల్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇదేవిధంగా గట్టిగా పనిచేసి గడువు లోపల ప్రతి ఓటరు సమగ్ర సర్వేలో పాల్గొనే విధంగా చేయాలని దిశా నిర్దేశం చేశారు. మండల తాసిల్దార్ విజయకుమార్ గారు మాట్లాడుతూ ఓటర్లు సమగ్ర సర్వేలో పాల్గొనే విధంగా చేసి వారి ఓటును భద్రపరచడం లక్ష్యంగా బిఎల్వోలు అందరూ పనిచేస్తున్నారని తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి సింగిల్ విండో చైర్మన్ దారపునేని దశరథ రామానాయుడు, భాకరాపేట యువ నాయకుడు తుర్రా ప్రతాప్ నాయుడు, మండల ఐటీడీపీ అధ్యక్షులు పెగడ హరిప్రసాద్ తదితర టిడిపి నాయకులు పలువురు హాజరయ్యారు స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బంది వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు





# దేశసమైక్యతకు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ విశేష కృషి

### - బిజెపి సీనియర్ నాయకులు బర్నేపల్లి రవికుమార్ ప్రశంసలు

మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 155వ బూత్ పరిధిలో సోమవారం బూత్ అధ్యక్షులు బర్నేపల్లె రవికుమార్ అధ్యక్షతన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ అజ్మతుల్లా ఖాన్, బర్నేపల్లి రవి కుమార్, విజయ్, సీనియర్ నాయకులు నాగరాజు, హరికృష్ణ, మధు, ఆది నారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా దేశ సమైక్యత, జాతీయత కోసం ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# అమరావతి ఛాంపియన్‌షిప్-2026 పోస్టర్స్ ఆవిష్కరణ

### - హాజరైన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఇతర అధికారులు

మదనపల్లె (ప్రజా సీమ) :




ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న అమరావతి ఛాంపియన్‌షిప్--2026 ప్రచార పోస్టర్లను సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఈ ప్రతిష్ఠాత్మక ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో నియోజకవర్గ, జిల్లాస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహిం చేందుకు సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, చెస్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, యోగా తదితర మొత్తం 12 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూలై 15 నుంచి ఆగస్టు 26 వరకు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్-17, అండర్-23 విభాగాల్లో బాలురు, బాలికలకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అర్హులైన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి, డిఎల్ డిఓ లక్ష్మీపతి, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జి.చంద్రశేఖర్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పీలేరు అభివృద్ధికి మరో కీలక అడుగు

### -రూ.1.48 కోట్లతో మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆమోదం

### -డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ ద్వా రా నిధుల మంజూరు

### - ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చొరవ ఫలితం

పీలేరు ప్రజాసీమ:



పీలేరు పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ (డి యం ఎఫ్ ) ద్వారా రూ. 1.48 కోట్ల వ్యయంతో పీలేరు గ్రామపంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆమోదం లభించినట్లు పీలేరు నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్, తెలుగుదేశం పార్టీ నాయకులు పోలిశెట్టి సురేంద్ర తెలిపారు. ఈ నిధులతో అవసరమైన ప్రాంతాల్లో యూజీడీ పైపులైన్ ద్వారా మురుగునీటి కాలువల నిర్మాణంతో పాటు సీసీ కాలువలను కూడా నిర్మించనున్నారు. దీంతో వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండడం, రోడ్లపై నీరు చేరడం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని పేర్కొన్నారు. పీలేరు పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో పీలేరు శాసనసభ్యులు శ్రీ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి తీసుకురావడంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు. ఈ పనులు పూర్తయితే పట్టణంలోని అనేక ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడటంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని, మురుగునీటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుందని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పీలేరు అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని వెల్లడించారు. పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజా సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని పోలిశెట్టి సురేంద్ర విజ్ఞప్తి చేశారు.

# ఏఎఫ్ఏసి క్యాంపులో మిట్స్ ఎన్.సి.సి క్యాడెట్ అద్భుత ప్రతిభ

### - అభినందించిన ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి

మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె సమీపంలోని (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఎన్‌సీసీ ఎయిర్ వింగ్‌కు చెందిన క్యాడెట్ జి.రుద్రతేజ భారత వైమానిక దళం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఎయిర్ ఫోర్స్ అటాచ్‌మెంట్ క్యాంప్ (ఏఎఫ్ఏసి)ను విజయవంతంగా పూర్తిచేసి విశిష్ట ప్రతిభ కనబరిచాడని వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ స్థాయి శిక్షణను హైదరాబాద్‌లోని దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా క్యాడెట్ రుద్ర తేజకు భారత వైమానిక దళం కార్యకలాపాలు, యుద్ధ మరియు శిక్షణ విమానాల పరిచయం, విమాన యాన సాంకేతిక అంశాలు, సైనిక క్రమశిక్షణ, నాయకత్వ వికాసం, జట్టు భావన, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై సమగ్ర శిక్షణ పొందారన్నారు. అలాగే భారత వైమానిక దళ అధికారులతో ప్రత్యక్షంగా మమేకమై వారి అనుభవాలను తెలుసుకునే అవకాశం పొందారని తెలిపారు. దేశ నలుమూలల నుండి 100 మందికిపైగా పాల్గొన్న ఈ శిక్షణలో మిట్స్ యూనివర్సిటీ క్యాడెట్ ప్రతిభ చూపడం గర్వకారణమన్నారు. ఈ జాతీయ స్థాయి శిక్షణా శిబిరం ఎయిర్ ఫోర్స్ అటాచ్‌మెంట్ క్యాంప్ కమాండెంట్ వింగ్ కమాండర్ ఆర్యన్ ఆధ్వర్యంలో నిర్వహించబడిందని ఆయన తెలిపారు. జాతీయస్థాయి శిక్షణా కార్యక్రమంలో ప్రతిభ చూపిన క్యాడెట్ జి.రుద్రతేజను మిట్స్ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, వైస్-ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్, ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ కేర్ టేకింగ్ ఆఫీసర్ చరణ్ కూచి మరియు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



# ఎన్యూమరేషన్ పత్రాలను పూరించి బిఎల్వోలకు అందజేయండి

### సర్ కార్యక్రమంలో భాగంగా తల్లెం భరత్ కుమార్ రెడ్డి పిలుపు

రైల్వే కోడూరు,( ప్రజా సీమ)

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణంలోని పాత బజారు నందు సోమవారం సర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాలను సంబంధిత ఓటర్లకు బిఎల్ఓ ల ద్వారా పంపిణీ చేసి వాటిని వెంటనే పూరించి మరల బిఎల్ఓ లకు అందజేయాలని రాయలసీమ జోన్ వైసీపీ బూత్ కమిటీ అధ్యక్షులు , డి ఆర్ యు సి సి సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షులు సి హెచ్ రమేష్ ఓటర్లకు తెలిపారు. ఈ సర్ కార్యక్రమంలో భాగంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మీయొక్క ఓటు హక్కును కాపాడుకోవాలి అంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న సర్ కార్యక్రమం లో భాగంగా ప్రతి ఓటర్ కీ సంబంధించి ఎన్యూమరేషన్ పత్రాలను ఇవ్వడం జరుగుతుందని అందులో మీ యొక్క ఓటుకు సంబంధించి పూర్తి సమాచారం నమోదు చేసి మరల ఆ యొక్క పత్రాలను సంబంధిత బి ఎల్ వో కు అందజేసి అంతర్జాలం ద్వారా నమోదు చేసుకుంటారని తద్వారా మీ యొక్క ఓటు హక్కును కోల్పోకుండా 20 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ యొక్క ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రతి ఒక్క ఓటర్ అవగాహనతో ఈ యొక్క సర్ కార్యక్రమాన్ని వినియోగించుకుని మీ ఓటు మీ ఆయుధం అనే నినాదంతో ఓటర్లంతా తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గునిశెట్టి రమేశ్, శేఖర్, మేడా వెంకట సుబ్బయ్య, పవన్, రమణ, శ్రీను, వెంకటేష్, సురేంద్ర లు పాల్గొన్నారు.





# భాజపా ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

### - హాజరైన జిల్లా అధ్యక్షులు పులి నరేంద్ర కుమార్ రెడ్డి

మదనపల్లె (ప్రజా సీమ) :

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, గొప్ప దేశభక్తుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని పురస్కరించుకొని సోమవారం అన్నమయ్య జిల్లా, మదనపల్లి పట్టణం, నీరుగట్టువారిపల్లి మార్కెట్ యార్డ్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు పులి నరేంద్ర కుమార్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్ మాట్లాడుతూ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గొప్ప విద్యావేత్త, దూరదృష్టి గల రాజనీతిజ్ఞుడు అని కొనియాడారు. భారతదేశ సమైక్యత మరియు సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండరాదనే నినాదంతో జమ్మూకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి కోసం పోరాడి అమరులయ్యారని గుర్తు చేశారు. ఆయన త్యాగం, దేశభక్తి మరియు సేవాభావం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశ ఐక్యత మరియు అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ భగవాన్, టౌన్ అధ్యక్షులు కిరణ్ కుమార్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు తిలకం నాయక్, టౌన్ ప్రధాన కార్యదర్శి గోకుల్, భోజనపు వెంకటనారాయణ, కృష్ణమూర్తి, శంకర్ రెడ్డి, దేవా నాగార్జున, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



# సర్ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేద్దాం

## వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి.

రైల్వే కోడూరు (ప్రజా సీమ):



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు లో సర్పంచులు ఎంపీటీసీలు వార్డు మెంబర్లు మాజీ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల లోని సర్పంచులు, ఎంపీటీసీలు సీనియర్ నాయకులు, క్రియాశీలక కార్యకర్తలతో సర్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించిన వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ద్వజా రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ కార్యక్రమం 14 తేదీ లోపు ముగుస్తున్నది కాబట్టి ప్రతి ఒక్కరు తమ పంచాయతీ వార్డు, బూత్ పరిధిలోని ప్రతి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తెలియజేశారు ఎక్కడైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే తనకు తెలియజేయాలని, పరిస్థితిని బట్టి ఎలక్షన్ కమిషన్ దృష్టికి మరియు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రతి ఓటు నమోదు అయ్యేవిధంగా కృషి చేస్తానని ఈ మేరకు రామిరెడ్డి ప్రజారెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట శివ సాయి, సర్పంచులు హరికృష్ణ రెడ్డి, దార్ల చంద్రశేఖర్, ఆర్ వి రమణ, చంగల్ రెడ్డి, గోపి, సుబ్రహ్మణ్యం రాజు, శైలజ రమణయ్య, ఎంపీటీసీలు నూక మహేశ్వర్ రెడ్డి , రౌఫ్, ప్రసాద్ రెడ్డి ,సీనియర్ నాయకులు ఓబుల్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి, ధనుంజయ నాయుడు, బై శంకర్ రెడ్డి,కృష్ణారెడ్డి, ఆనంద్ యాదవ్, శ్రీనివాసులు రెడ్డి,బత్తల సుబ్రహ్మణ్యం, ప్రసాద్, రమణ రెడ్డి ,అనంతరాజుపేట షఫీ, మణి, కోటి, శ్రీనాథ్ నాయుడు , మైనార్టీ నాయకులు అబ్దుల్ సలామ్, శివకుమార్ రాజు, కంభం శ్రీనివాస్ రెడ్డి, బై రెడ్డి అనిల్ రెడ్డి, కుంచం హరి ,సంటి నాగరాజు, నరేంద్ర, కుమార్, వెంకటేష్ , పవన్ రెడ్డి,మహేష్ ,నితీష్, పార్టీ నాయకులు మరియు క్రియాశీల కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం అందించడమే పోలీసుల లక్ష్యం

## - అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి స్పష్టం

మదనపల్లె (ప్రజా సీమ) :

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బాధితుల నుండి అర్జీలను స్వీకరించారు.బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ఎస్పీ తక్షణమే చట్టప్రకారం న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని,తీసుకున్న చర్యల నివేదికను వెంటనే కార్యాలయానికి సమర్పించాలని స్పష్టం చేశారు.జిల్లా కేంద్రానికి రాలేని వారు తమ పరిధిలోని స్థానిక పోలీస్ స్టేషన్లలోనే నేరుగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.స్థానిక పోలీసు స్టేషన్లలో ఇచ్చే అర్జీలను కూడా పీజీఆర్ఎస్ కిందనే పరిగణించి,ప్రజలకు సత్వర న్యాయం అందిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు.



# ఎస్ఐఆర్ గడువు పెంపు ఉండదు

## -విధుల్లో నిర్లక్ష్యం వహించే బిఎల్ఓ లపై చర్యలు తప్పవు-రాజంపేట సబ్ కలెక్టర్ భావన





సిద్దవటం ప్రజా సీమ

ఎస్ఐఆర్ గడువు పెంపు ఉండదని జులై 14 లోగా ఎన్యుమరషన్ ఫాం లను బిఎల్ఓ లు డిజిటలైజేషన్ పూర్తి చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన స్పష్టం చేశారు. సిద్దవటం జెడ్పీ హైస్కూల్ లో సోమవారం సిద్దవటం తహసీల్దార్ విజయ్ కుమార్ ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపెనింగ్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ భావన మాట్లాడుతూ బిఎల్ఓ లు జులై 14 లోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎస్ఐఆర్ విధుల్లో నిర్లక్ష్యం వహించే బిఎల్ఓ లపై చర్యలు తప్పవని హెచ్చరించామన్నారు. బిఎల్ఓ లకు సహాయం చేసేందుకు అంగన్వాడీ టీచర్, ఎస్.హెచ్.జి విఓఏ లను కేటాయించడం జరిగిందన్నారు. రాజంపేట నియోజక వర్గంలో 2 లక్షల 43 వేల 778 ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు 53.94 శాతం డిజిటలైజేషన్ ను బిఎల్ఓ లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రజల్లో అవగాహన లేకపోవడంతోనే ఎస్ఐఆర్ ప్రక్రియ ఆలస్యమవుతుందని ఎస్ఐఆర్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఎవరికైనా ఎన్యుమరషన్ ఫాం లు అందకపోతే 1950 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చెయ్యవచ్చునన్నారు. ఏమైన సమస్యలు ఉంటే ఎన్నికల కమీషన్ పోర్టల్ కు ఫిర్యాదు చేస్తే 24 గంటల్లో సమస్య పరిష్కారించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, బిఎల్ఓ లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

## ఎ ఐ సి సి కార్యదర్శి గణేష్ యాదవ్‌ను కలిసిన పీలేరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బా శ్రీకాంత్

పీలేరు (ప్రజా సీమ):

రాయచోటిలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పీలేరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బా శ్రీకాంత్ పాల్గొని, ఎ ఐ సి సి కార్యదర్శి గణేష్ యాదవ్, పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వల్లిలను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సంద ర్భంగా పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణం, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన పోరాటాల గురించి నాయకులతో చర్చించారు. పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయడంలో కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని నాయకులు పేర్కొన్నారు.ఏ ఐ సి సి కార్యదర్శి గణేష్ యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వల్లి మాట్లాడుతూ, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల భాస్కర్, పీలేరు నియోజకవర్గ ఇంచార్జ్ బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కేఎంసి నూతన కమిషనర్‌గా భవాని ప్రసాద్ బాధ్యతల స్వీకరణ..

కడప, జూలై 6 (ప్రజా సీమ):

కడప నగరపాలక సంస్థ (కేఎంసి) నూతన కమిషనర్‌గా పి. భవాని ప్రసాద్ సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ డా. చెరుకూరి శ్రీధర్ ని మర్యాదపూర్వకంగా కలిసి వారి మార్గదర్శకాలను స్వీకరించారు.అనంతరం సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన ను కూడా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ.. కడప నగరాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగు పరచడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన పౌర సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ నగరాన్ని మరింత పరిశుభ్రంగా, అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.



# మైక్రో టవర్ కాలనీ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

## విద్యార్థులకు పలకలు, బలపాలు, కాలనీవాసులు హోమియో మందులు పంపిణీ

ప్రజా సీమ ప్రతినిధి - కోట

నెల్లూరు జిల్లా కోట మండలం చిట్టేడు పంచాయతీ పరిధిలోని మైక్రో టవర్ గిరిజన కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం పాఠశాల అంగన్వాడీ చిన్నారులకు చెందోడు గ్రామానికి చెందిన ఎం.వి రావు ఫౌండేషన్ నిర్వాహకులు హోమియో మందులు, విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ముప్పవరపు సుబ్బాయమ్మ మృతికి జ్ఞాపకార్థం వారి పేరిట వారికి ఆత్మశాంతి కలగాలని కోరుకుంటూ ఎం.వి రావు ఫౌండేషన్ నిర్వాహకులు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజేశ్వరి చేతుల మీదగా విద్యార్థులకు పలక బలపాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు చిన్నారులకు వేసవి కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు సోక కుండా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా హోమియో మందులు పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులకు అంగన్వాడీ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఎం.వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం.విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయిని రాజేశ్వరి గ్రామస్తులు అంగనవాడి సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు...



# ఎన్యూమరేషన్ పత్రాలను పూరించి బిఎల్వోలకు అందజేయండి

## సర్ కార్యక్రమంలో భాగంగా తల్లెం భరత్ కుమార్ రెడ్డి పిలుపు

రైల్వే కోడూరు ( ప్రజా సీమ )

కోడూరు పట్టణంలోని పాత బజారు నందు సోమవారం సర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాలను సంబంధిత ఓటర్లకు బిఎల్ఓ ల ద్వారా పంపిణీ చేసి వాటిని వెంటనే పూరించి మరల బిఎల్ఓ లకు అందజేయాలని రాయలసీమ జోన్ వైసీపీ బూత్ కమిటీ అధ్యక్షులు , డి ఆర్ యు సి సి సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షులు సి హెచ్ రమేష్ ఓటర్లకు తెలిపారు.దఈ సర్ కార్యక్రమంలో భాగంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మీయొక్క ఓటు హక్కును కాపాడుకోవాలి అంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న సర్ కార్యక్రమం లో భాగంగా ప్రతి ఓటర్ కీ సంబంధించి ఎన్యూమరేషన్ పత్రాలను ఇవ్వడం జరుగుతుందని అందులో మీ యొక్క ఓటుకు సంబంధించి పూర్తి సమాచారం నమోదు చేసి మరల ఆ యొక్క పత్రాలను సంబంధిత బి ఎల్ వో కు అందజేసి అంతర్జాలం ద్వారా నమోదు చేసుకుంటారని తద్వారా మీ యొక్క ఓటు హక్కును కోల్పోకుండా 20 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ యొక్క ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రతి ఒక్క ఓటర్ అవగాహనతో ఈ యొక్క సర్ కార్యక్రమాన్ని వినియోగించుకుని మీ ఓటు మీ ఆయుధం అనే నినాదంతో ఓటర్లంతా తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గునిశెట్టి రమేశ్,శేఖర్, మేడా వెంకట సుబ్బయ్య, పవన్, రమణ,శ్రీను, వెంకటేష్, సురేంద్ర లు పాల్గొన్నారు.



# పివోకేలో మళ్లీ నిరసనలు

## రోడ్డుపైకి వచ్చిన నిరసనకారులు

## పాక్ దళాల కాల్పుల్లో మరొకరు మృతి

## భారత్ సాయం కొందరి అభ్యర్థన

శ్రీనగర్,జూలై6ప్రజా సీమ :

పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ లో నిరసనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తాజా కాల్పుల్లో ఒకరు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఆందోళన కారులను అణిచివేసేందుకు పాక్ కఠినంగా వ్యవహరిస్తోంది. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే.. జులై 9న ఫైనల్ యాక్షన్‌ను ప్రారంభిస్తామని జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ పాక్ సర్కారుకు అల్టిమేటం ఇచ్చింది. తమ నిరసనల్లో భాగం కావాలని పీఓకే ప్రజలు, ప్రవాస కశ్మీరీలకు పిలుపునిచ్చింది. ఆ రోజున పీఓకేలో పర్యటించాలని ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా, మానవహక్కుల సంఘాలను ఆహ్వానించింది. ఆ డెడ్‌లైన్ గడువు వరకు క్షమశిక్షణతో వ్యవహరించాలని తన మద్దతుదారులను కోరింది. పాక్ ప్రభుత్వ అణచివేతలు, పౌరుల హత్యలను అంతర్జాతీయ సమాజం గమనించాలని జేఏఏసీ అభ్యర్థించింది. నిరసల్లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించింది. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని జేఏఏసీ డిమాండ్ చేస్తోంది. ప్రజల డిమాండ్లకు తూటాలతో స్పందిస్తే.. తమకు ఇతర మార్గాలు ఉన్నాయని పాక్ ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరించింది. కాగా.. జేఏఏసీ నేత సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడినట్లు ఉన్న ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. 'మాకు భారత్ సహాయం కావాలి. ఆహారపదార్థాలు, నిత్యావసరాల కొరత ఉంది. మానవతా సాయం అందించండి' అని ఆయన కోరినట్టుగా ఆ వీడియోలో ఉండటం గమనార్హం. నిరసనలను కఠినంగా అణచివేస్తోన్న పాక్.. ఆర్థిక దిగ్బంధనాన్ని విధించిదని అందులో ఆరోపించారు. పరిస్థితులు మరింత దిగజారితే పౌరులు భారత్‌కు వచ్చేందుకు వీలుగా నియంత్రణ రేఖ వెంట సరిహద్దును తెరవాలని అమన్ ఖాన్ విజ్ఞప్తి చేశారు. గత కొన్నిరోజులుగా పీఓకేలో పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

# ఎర్రచందనం ముద్దాయి పై పీడీ యాక్ట్

## ఎర్రచందనం అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపుతున్న టాస్క్ ఫోర్స్

ప్రజా సీమ ప్రతినిధి - తిరుపతి

ఎర్రచందనం అక్రమ రవాణాకు చెందిన పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న కేరళకు చెందిన నాసర్ కెఎన్ అలియాస్ నాసర్ భాయ్ పై టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీ పీ.శ్రీనివాస్ అద్వర్యంలో ఎఎస్పీ జె.కులశేఖర్ మార్గ నిర్దేశకత్వంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా..ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్ కు పాల్పడుతున్న వారి పై పీడీ యాక్ట్ లు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కేరళకు చెందిన నాసర్ కెఎన్ ఎలియాస్ నాసర్ భాయ్ తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా మెట్టుపాలయంలో ఉంటూ ఎర్రచందనం స్మగ్లింగ్ కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఇతని పై పీడీ యాక్ట్ అమలుకు టాస్క్ ఫోర్స్ సిఫారసు చేసింది. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఇతని పై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇతను ఎర్రచందనం కొల్లగొట్టడుతూ..వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజాజీవనానికి అటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. ఇతని పై ఆరు ఎర్రచందనం కేసులు ఉన్నాయి. ఇతని పై పీడీ యాక్ట్ అమలులో భాగంగా నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకంలో భాగంగా పీడీ యాక్ట్ అమలు చేయడానికి వెనుకాడబోమని టాస్క్ ఫోర్సు ఎస్పీ హెచ్చరించారు. ఎర్రచందనం కేసుల్లో ఇప్పటికే అనేక మందికి శిక్షలు పడ్డాయని గుర్తు చేశారు. యువత ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రయత్నించి వారి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని చెప్పారు. స్మగ్లర్లకు శిక్ష పడటంతో పాటు వారి ఆస్తులు కూడా జప్తు చేసుకో పడతాయని తెలియజేసారు...

ప్రజాసీమ

# ప్రజల ఆస్తుల భద్రతకు ముప్పు తెచ్చేలా జీఓ నెంబర్ 396

## - ప్రైవేటీకరణ విధానాన్ని వెంటనే విరమించుకోలి

## - జిల్లా కలెక్టర్ కి దస్తావేజు లేఖరులు,స్టాంప్ వెండర్స్ వినతి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

ప్రజల ఆస్తులకు పూర్తిభద్రత కల్పించాలని,అందుకోసం తక్షణమే జీవో నంబర్ 396ను రద్దు చేయాలని అంధ్రప్రదేశ్ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం (మదనపల్లి,అన్నమయ్య జిల్లా శాఖ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.ఈ మేరకు సంఘం అధ్యక్షులు రంగు గుణశేఖర్,కార్యదర్శి కంగేరి నందా కమిటీ సభ్యులతో కలిసి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పీజీఆర్ఎస్ నందు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కి వినతిపత్రం సమర్పించారు.సదరు ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ స్టాంపులు,రిజిస్ట్రేషన్ల శాఖ సేవలను ప్రైవేటుపరం చేసే అలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు.అదేవిధంగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.ప్రజల అస్తుల రక్షణ కోసం వివాదాస్పద జీవో నంబర్ 396ను వెంటనే రద్దు చేయాలని,లేనియెడల ఆందోళన మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దస్తావేజులేఖర్ల సంఘం మదనపల్లె కమిటీ సభ్యులు మంచినీళ్ల నాగ మునీంద్ర,రంగు రాజేంద్ర,రెడ్డెప్ప యాదవ్,లవాని మహమ్మద్ ఖాన్,కరూర్ వెంకటేష్,రామయ్య గుప్తా,సాయిరాం,మచ్చా నారాయణ,చంద్రశేఖర్,సాయి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారుు.



# SIR సర్వేలో సందేహాలకు ఎవరు సమాధానం చెబుతారు?

## ఓటర్లలో అయోమయం -గడువు పొడిగించాలని విజ్ఞప్తి

**పీలేరు (ప్రజాసీమ) :**

భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమం పీలేరు నియోజకవర్గంలో వేగంగా కొనసాగుతున్నప్పటికీ, సర్వే ఫారాలపై ఓటర్లలో అనేక సందేహాలు వ్యక్తమవు తున్నాయి. అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న ప్పటికీ, ఫారంలోని కొన్ని అంశాలు సామాన్య ప్రజలకు సులభంగా అర్థం కావడం లేదని పలువురు పేర్కొంటు న్నారు. ఈ సర్వేకు సంబంధించిన గణన ఫారాలను సుమారు 25 రోజుల క్రితమే బూత్ లెవల్ అధికారులు (బి ఎల్ ఓ లు) ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ చాలా అరుదుగా, దాదాపు 20 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించ బడుతుందని ఎన్నికల అధి కారులు చెబుతున్నారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు బి ఎల్ వో లకు ఇప్పటికే రెండు విడతలుగా శిక్షణ కూడా ఇచ్చారు.ఫారంలో ఓటరు పేరు, చిరునామా, నియోజకవర్గం, బూత్ నంబర్, ఫోటోతో పాటు పుట్టిన తేదీ, పుట్టిన స్థలం, కుటుంబ సభ్యుల వివరాలు, అవసరమైన ధృవీకరణ పత్రాల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ వివరాలు ఎలా నింపాలి, ఏ పత్రాలు జత చేయాలి అనే విషయాల్లో గ్రామీణ ప్రాంతాల ఓటర్లకు స్పష్టత లేక ఇబ్బం దులు ఎదురవుతున్నాయి.ముఖ్యంగా మండల కేంద్రాలకు, ఇతర పట్టణాలకు, రాష్ట్రాల బయటకు ఉపాధి కోసం వెళ్లిన ఓటర్లు సుమారు 20 శాతం వరకు ఉండటంతో బి ఎల్ వో లు వారిని సంప్రదించడం కష్టసాధ్యంగా మారింది. నిబంధనల ప్రకారం ఒక్కో పరిధిలో 500 నుంచి 800 మంది వరకు ఓటర్లు ఉండటంతో ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించడం సమయం తీసుకుంటోంది. ఇదే సమయంలో పని త్వరగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో కొన్ని ప్రాంతాల్లో నాలుగు లేదా ఐదు బూత్‌ల ఓటర్లను ఒకేచోటకు పిలిచి ఫారాలను స్వీకరించి వివరాలు నమోదు చేస్తున్నట్లు సమా చారం. అయితే ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేయాల్సిన విధానం పూర్తిగా అమలు కావడం లేదనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి ఎన్నికల సంఘం కేవలం నెల రోజుల గడువే ఇవ్వగా, తుది గడువు ఈ నెల 14వ తేదీతో ముగియనుంది. ప్రస్తుతం సర్వే సుమారు 55 శాతం వరకు పూర్తయిందని సమాచారం. మిగిలిన వివరాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడం అధికారులకు




సవాలుగా మారిందని తెలుస్తోంది.సర్వే విజయవంతం కావడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా సహకరిస్తున్నారు. మండల స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు, డివిజనల్ అధికారులు తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతిని పరిశీలిస్తున్నారు. ప్రతి భారత పౌరుడు తన ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు వంటి అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకొని, ఫారాలను సక్రమంగా నింపి అధికారులకు అందిం చడం తమ బాధ్యత అని అధికారులు సూచిస్తున్నారు. అయితే ఫారంలోని సందేహాలను నివృత్తి చేయడానికి గ్రామ స్థాయిలో ప్రత్యేక సహాయ కేంద్రాలు లేదా అవగాహన కార్య క్రమాలు నిర్వహించాలని పలువురు ఓటర్లు కోరుతున్నారు.అలాగే ప్రస్తుత గడువులో అందరినీ చేరుకోవడం కష్టమవు తుందని భావిస్తున్న ఓటర్లు, ప్రజా ప్రతి నిధులు గడువు ముగిసిన తర్వాత కనీసం మరో 15 రోజులపాటు అవకాశం కల్పిం చాలని ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. గడువు పొడిగిస్తే బయట ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు కూడా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం లభిస్తుందని వారు అభిప్రాయ పడుతున్నారు.

# ఎస్ఐఆర్ స్పెషల్ కంపిటేషన్ ఏర్పాటు తహసీల్దార్ విజయ్ కుమార్

**సిద్దవటం ప్రజా సీమ**

సిద్దవటం మండలంలో మండల స్థాయి అధికారులు, ఫీల్డ్ లెవల్ సిబ్బందితో సహా స్పెషల్ కంపిటేషన్ ఏర్పాటు చేశామని తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. మండలకేంద్రమైన సిద్దవటం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఐఆర్ పై సోమవారం స్పెషల్ కంపిటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల రాజంపేట సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి పోలింగ్ బూతుకు బిఎల్ఓ, అడిషనల్ బిఎల్ఓ, అంగన్వాడీ టీచర్, ఎస్.హెచ్.జి విఓఏ, ఫీల్డ్ అసిస్టెంట్ ఐదు మంది సహకారంతో సోమవారం 80 శాతం డిజిటలైజేషన్ చేసేందుకు కృషి చేయాలన్నారు. మండలంలోని 40 పోలింగ్ కేంద్రాలలో స్పెషల్ కంపిటేషన్ కార్యక్రమం జులై 15 వరకు కొనసాగుతుందన్నారు. ఎన్యుమరేషన్ ఫారం లు రానివారికి ఆయా పోలింగ్ కేంద్రాల పరిధుల్లో ఏర్పాటు చేసిన స్పెషల్ కంపిటేషన్ కేంద్రాల్లో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడిఓ ఫణి రాజకుమారి, డిప్యూటీ ఎంపీడిఓ మెహెతాబ్ యాస్మిన్, ఉపాధి హామీ ఏపీఓ నరసింహులు ఆర్ ఐ ప్రసాద్, వెలుగు ఏపీఎం, బిఎల్ఓ లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.





# కొత్త పింఛన్ల కోసం నిరుపేదల ఎదురుచూపులు

## ఎన్నికల హామీల అమలుపై ఆశగా పేదలు -- త్వరగా మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

**పీలేరు ప్రజాసీమ :**



అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు కొత్త సామాజిక భద్రతా పింఛన్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులతో పాటు ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీల ప్రకారం అర్హత కలిగిన మైనారిటీలకు కూడా పింఛన్లు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచార సమయంలో సామాజిక సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. ఆ హామీలపై ప్రజల్లో ఇప్పటికీ ఆశలు ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికే పలు సంక్షేమ హామీల అమలుపై చర్యలు చేపట్టిన నేపథ్యంలో, కొత్త పింఛన్ల మంజూరుపై కూడా త్వరలో స్పష్టమైన నిర్ణయం వస్తుందనే ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం గత నెల 12వ తేదీన కొత్త పింఛన్ల మంజూరుపై ప్రకటన చేసినప్పటికీ, ఇప్పటి వరకు అర్హుల ఎంపిక, మంజూరు ప్రక్రియ పూర్తికాలేదని లబ్ధిదారులు చెబుతున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త పింఛన్లు మంజూరై ఉంటే, నెలవారీ పింఛన్ల రూపంలో ఇప్పటికి గణనీయమైన ఆర్థిక సహాయం అందేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం అమరావతి అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరిశ్రమలు, రక్షణ రంగానికి సంబంధించిన తయారీ యూనిట్లు, రైల్వే వంటి కీలక ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని ప్రభుత్వం పేర్కొంటోంది. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాల అమలుకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.కొత్త ఇంటి స్థలాల మంజూరు, గతంలో ఆమోదం పొందిన గృహాల నిర్మాణానికి నిధుల విడుదల కూడా వేగవంతం చేయాలని అర్హులైన లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. పేద కుటుంబాలకు ఇల్లు, పింఛన్ వంటి ప్రాథమిక సంక్షేమ పథకాలు త్వరగా అందితే వారి జీవనోపాధికి ఎంతో ఊరట లభిస్తుందని వారు అంటున్నారు.పీలేరు నియోజకవర్గంలోని పేద ప్రజలు, వృద్ధులు, మహిళలు, మైనారిటీలు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులు కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ఎన్నికల హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# సమయస్ఫూర్తి తో ప్రతి ఒక్కరు తమ ఓటును పరిరక్షించుకోవలసిన సమయం..!

## మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు.

**రైల్వేకోడూరు (ప్రజా సీమ ):**

కోడూరు మండలం బుడుగుంటపల్లి పంచాయతి అయ్యవారిపల్లి గ్రామం నందు నిర్వహిస్తున్న సర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్ సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు రచ్చబండ తరహాలో ఓటర్లతో మేమకమై ప్రతి ఒక్కరూ తమ తమ ఓట్లను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని ఓటర్లకు తెలియ జేస్తూ, ఇతర దేశాలలో, ప్రాంతాలల్లో ఉన్న తమ బంధువులు స్నేహితులు, ఓటర్ల వివరాలు కూడా సేకరించి వైస్సార్సీపీ బీఎల్ ఎ లకు అందజేయాలని, ఏవైనా సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు, సమయం ఎనిమిది రోజులు ఉండడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించి సమయస్ఫూర్తితో వ్యవహరించి ఈ కొద్ది రోజులు పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు పంజం వేణుగోపాల్ రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాళ్ళ హేమన వర్మ, మాధీనేని వెంకట్ రెడ్డి, జడ్పిటిసి రత్నమ్మ,తిరుపతి సూరి, డిస్టిక్ యూత్ జనరల్ సెక్రటరీ ఘని (రాజా ) నారాయణమ్మ, దాసరి, వంశీ రవి,వార్డ్ మెంబెర్ వెంకయ్యస్వామి, శ్యామ్, నాగేశ్వర్ రెడ్డి, కంపరాజు నాగేంద్ర వర్మ ఇరువురి వెంకటయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు



# ఓట్లను తొలగించడం కుట్రే

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య

**పుల్లంపేట ప్రజాసీమ :**



ఓట్లను తొలగించడం పాలక పార్టీల కుట్రేయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సి సెల్ కన్వీనర్ శాంతయ్య పేర్కొన్నారు. సోమవారం అనంతంపల్లి పరిసర గ్రామాల్లో ఓట్లను చెక్ చేసుకొనే అంశం పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భముగా అయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర పాలక పార్టీలు రక్తపాతం లేకుండా మారణహోమం సృష్టిస్తున్నా రన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ విధానం కొనసాగిస్తున్నా రన్నారు మోడీ ప్రభుత్వం తనకు వ్యతిరేక పార్టీలపై కక్ష్య సాధింపు నిరంతరం చేపబడుతున్నా రన్నారు ప్రతిపక్ష పార్టీ ల ఓట్లే లక్ష్యంగా చేసుకుని ఓట్లు తొలగిస్తున్నారని అయన ఆరోపించారు. సమాచారహక్కుచట్టం ద్వారా ఈ అంశాలు వెలుగులోకొచ్చాయని పేర్కొన్నారు. 17ఎ, 17సి, 20ఫారం లను వివరించారు. కార్యక్రమంలో మండల, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతుకలను అణచివేసే కుట్రలు మానుకోవాలి

## - ఏఐవైఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు విజయన్ ఆగ్రహం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించే జర్నలిస్టులు,యూట్యూబర్లు,సోషల్ మీడియా కార్య కర్తలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఏఐవైఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు విజయన్ తీవ్రంగా మండిపడ్డారు. సోమ వారం అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ విమర్శలను ఎదుర్కోలేక ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని దుర్విని యోగం చేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తోందని ఆరోపించారు.జర్నలిస్టు రామన్ సహా ప్రజల తరపున గొంతెత్తుతున్న వారిపై నమోదు చేసిన కేసులను ప్రభుత్వం బేష రతుగా వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును అణచివేయాలని చేసే ప్రతి ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొడతారని హెచ్చ రించారు. ప్రజల సమస్యలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం,ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం మానుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంఘాలను, యువతను, ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేసి భారీ ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను కాలరాసే చర్యలను ఏఐవైఎఫ్ ఏమాత్రం సహించదని, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాడుతామని విజయన్ హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మాధవ్,కోశాధికారి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సీమ

# 116 ఏళ్ల సామాన్య భక్తురాలికి వీఐపీ బ్రేక్ దర్శనం

బామ్మ ఆశీర్వాదం తీసుకున్న టీటీడీ ఈవో

తమిళనాడుకు చెందిన 116 ఏళ్ల బామ్మ నవనీతమ్మ

116 ఏళ్ల బామ్మ నవనీతమ్మ శ్రీవారి భక్తురాలు

బామ్మ కుటుంబ సభ్యులుతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి అలిపిరి నడక మార్గంలో వెళ్లారు

బామ్మను గమనించిన ఓ భక్తురాలు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వైనం

బామ్మ వివరాల కోసం టీటీడీ ఛైర్మన్ ఓ ట్వీట్ చేశారు.

ఆమె వివరాలు తెలిస్తే తమను సంపద్రించాలని ప్రకటన చేశారు

కొన్ని గంటల్లోనే టీటీడీ విజిలెన్స్ సిబ్బంది బామ్మ పేరు నవనీతమ్మగా గుర్తింపు

తమిళనాడు నుంచి వచ్చారని వివరాలు సేకరణ

తమిళనాడు బామ్మ నవనీతమ్మకు అరుదైన అవకాశం

తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం లభించింది

వేదాశీర్వచనం, పట్టువస్త్రం, తీర్థప్రసాదాలు అందజేత

టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర నవనీతమ్మకు పట్టువస్త్రం కప్పి..తీర్థ ప్రసాదాలు అందజేసి బామ్మ కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకొన్నారు

**ప్రజా సీమ ప్రతినిధి - తిరుమల**

తమిళనాడు బామ్మ నవనీతమ్మకు టీటీడీ అరుదైన అవకాశం కల్పించింది. ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం దక్కింది. టీటీడీ అధికారులు దర్శనం ఏర్పాట్లు చేసి దగ్గరుండి స్వామి దర్శనం చేయించారు. వెంకన్నను దర్శించుకున్న బామ్మ, కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. బామ్మకు వేదాశీర్వచనం చేయించి పట్టువస్త్రం కప్పి, తీర్థప్రసాదాలు కూడా అందజేశారు. టీటీడీ ఈవో బామ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన తమిళనాడుకు చెందిన 116 ఏళ్ల బామ్మ నవనీతమ్మకు తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం లభించింది. టీటీడీ అధికారులు బామ్మతో పాటుగా కుటుంబ సభ్యులకు దర్శన ఏర్పాట్లు చేసి దగ్గరుండి దర్శనం చేయించారు. వెంకన్న సేవలో పాల్గొన్న అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేశారు. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర నవనీతమ్మకు పట్టువస్త్రం కప్పి..తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన బామ్మ కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. నవనీతమ్మకు, ఆమె కుటుంబ సభ్యులకు శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. అనంతరం రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర వేదపండితులతో వేదాశీర్వచనం చేయించి పట్టువస్త్రం కప్పి, తీర్థ ప్రసాదాలు అందజేశారన్నారు. తన అమ్మమ్మ కోరికను నెరవేర్చి తమ కుటుంబ సభ్యులందరికి శ్రీవారి దర్శనం కల్పించినందుకు టీటీడీకి ఆమె మనవడు దిక్పతి ధన్యవాదాలు






తెలిపారన్నారు. నవీనతమ్మ వివరాలు సేకరించడంలో తమ వంతు సహకారం అందించిన సోషల్ మీడియా మిత్రులకు వెంటనే స్పందించి ఆమెను గుర్తించిన టీటీడీ విజిలెన్స్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీవారి భక్తురాలి జీవితకాల కోరిక నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమిళనాడుకు చెందిన నవనీతమ్మ వయసు 116 సంవత్సరాలు. ఆమె కుటుంబ సభ్యులుతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి అలిపిరి నడక మార్గంలో వెళ్లారు. బామ్మను గమనించిన ఓ భక్తురాలు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బామ్మ వివరాల కోసం టీటీడీ ఛైర్మన్ ఓ ట్వీట్ చేశారు. ఆమె వివరాలు తెలిస్తే తమను సంపద్రించాలని కోరారు. కొన్ని గంటల్లోనే టీటీడీ విజిలెన్స్ సిబ్బంది బామ్మ పేరు నవనీతమ్మ, తమిళనాడు నుంచి వచ్చారని వివరాలు సేకరించారు. బామ్మ తిరుపతి జీవకోనలో బంధువుల దగ్గర ఉంటున్నట్లు తెలిసింది. వెంటనే స్పందించిన టీటీడీ ఛైర్మన్..నవనీతమ్మతో పాటుగా కుటుంబ సభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇవాళ వారంతా తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు...

# తిరుమలలో టాక్సీ డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం

- తిరుమల పవిత్రత, ఆధ్యాత్మిక వాతావరణాన్ని పరిరక్షించడంలో భాగస్వాములు కావాలని టాక్సీ డ్రైవర్లకు సూచన.
- భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అవగాహన.
- సేవాభావం, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక విలువలను ప్రతిబింబించేలా విధులు నిర్వహించాలని ట్రాఫిక్ పోలీసుల సూచన

**ప్రజా సీమ : తిరుమల.**

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు, తిరుమలలో భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు క్షేత్ర పవిత్రత, ఆధ్యాత్మిక వాతావరణాన్ని పరిరక్షించే లక్ష్యంతో తిరుమల ట్రాఫిక్ పోలీసులు టాక్సీ డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల ట్రాఫిక్ సీఐ శ్రీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో టాక్సీ డ్రైవర్లకు తిరుమల క్షేత్ర ఔన్నత్యం, ఆధ్యాత్మిక విశిష్టత గురించి వివరించారు. తిరుమల ప్రపంచ ప్రసిద్ధ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమని, ఇక్కడ విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ తమ ప్రవర్తన, సేవా దృక్పథం ద్వారా భక్తులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అలాగే, తిరుమల ఆధ్యాత్మిక సంప్రదాయాలను ప్రతిబింబించేలా టాక్సీ డ్రైవర్లు స్వచ్ఛందంగా వైష్ణవ నామాలను ధరించి క్షేత్ర పవిత్రతను గౌరవించాలని కోరారు. భక్తులతో ఎల్లప్పుడూ మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అధిక చార్జీలు వసూలు చేయకుండా పారదర్శకంగా, సేవాభావంతో విధులు నిర్వహించాలని అధికారులు సూచించారు. తిరుమలకు విచ్చేసే ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడం ప్రతి టాక్సీ డ్రైవర్ సామాజిక బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది మరియు టాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.




# జిల్లా పోలీస్ కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమం

- జిల్లా వ్యాప్తంగా వచ్చిన 73 పిటిషన్ల స్వీకరణ.
- ప్రతి ఫిర్యాదుపై ప్రాధాన్యతతో విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కారానికి జిల్లా ఎస్పీ ఆదేశాలు.

**ప్రజా సీమ : తిరుపతి.**

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 73 పిటిషన్లను స్వీకరించి, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుదారుల వినతులను ఓర్పుగా విన్న అధికారులు, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించి చట్టపరమైన చర్యలను వేగవంతంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి బాధితుడికి సకాలంలో న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ప్రతి పిటిషన్‌ను వెంటనే సంబంధిత అధికారులకు పంపించి, ప్రాధాన్యత ఆధారంగా విచారణ పూర్తి చేసి నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ప్రజల ఫిర్యాదుల ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, చట్టపరంగా న్యాయం జరిగేలా అధికారులు కట్టుబడి పనిచేయాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ రమణ, పి.జి.ఆర్.ఎస్. సీఐ శ్రీ సుదర్శనరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.



# తిరుపతి జిల్లాలో వైఎస్సార్‌సీపీకి గట్టి షాక్

## జనసేనలో చేరిన యువ నేత మోహన్ కుమార్

**ప్రజా సీమ : చిన్నగొట్టిగల్లు.**

తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చిట్టేచర్ల గ్రామానికి చెందిన వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ బెల్లంకొండ మోహన్ కుమార్ ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. నియోజకవర్గంలో కీలకమైన యువ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన, వైఎస్సార్‌సీపీని వీడాలని తీసుకున్న నిర్ణయం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. సోమవారం చంద్రగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో బెల్లంకొండ మోహన్ కుమార్ తన ముఖ్య అనుచరులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. చంద్రగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ దేవర మనోహర్ సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా దేవర మనోహర్.. మోహన్ కుమార్‌కు జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి, చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి భాగస్వాములు కావాలనే ఉద్దేశంతోనే తాము జనసేనలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా బెల్లంకొండ మోహన్ కుమార్ ప్రకటించారు. మోహన్ కుమార్ వంటి క్రియాశీలక యువ నాయకుడు పార్టీలోకి రావడం వల్ల చంద్రగిరి నియోజకవర్గంలో జనసేన పార్టీ మరింత బలోపేతం అవుతుందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాడుతామని ఇన్‌చార్జ్ దేవర మనోహర్ ధీమా వ్యక్తం చేశారు.









# ప్రజా సమస్యల పై వచ్చే అర్జీలు త్వరితిగతిన పరిష్కరించాలి - సిపిఐ

**ప్రజా సీమ ప్రతినిధి - వెంకటగిరి**

తిరుపతి జిల్లా వెంకటగిరి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను అధికారులు త్వరితగతిన పూర్తి చేయడం లేదని అధికారులు అలసత్వం చేస్తున్నారని సిపిఐ నియోజకవర్గ వెంకటగిరి కార్యదర్శి పల్లె పాట బాలకృష్ణయ్య సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులను డిమాండ్ చేశారు. అమ్మవారిపేట చెరువు ఆక్రమణ పై జిల్లా అధికారులకు మండల అధికారులకు అనేక సార్లు అర్జీలు ఇచ్చిన ఇప్పటికే పరిష్కారం కాలేదని వివిధ శాఖల అధికారులు మాకేం సంబంధం లేదని ఒకరి పై ఒకరు సాకులు చెబుతూ జాప్యం చేస్తున్నారని అనేక సమస్యల పై అర్జీలు ఇచ్చినప్పటికీ అవి పూర్తికాకుండానే ఇంటి సాగకులు చెప్పి పరిష్కారం చేసినట్లు రికార్డులలో చూపిస్తున్నారని కూటమి ప్రభుత్వానికి మచ్చ తెచ్చేలా వ్యవహరిస్తున్నారని దీనిని నాయకులు గమనించుకోవాలని సూచించారు. ఒక అర్జీకి సుమారు 90 రోజులు వ్యవధి తీసుకొని చివరిలో ఏదో ఒక సాగుతో సమస్యను ప్రక్కదోవ పట్టిస్తున్నారని అధికారులు తీరు మార్చుకోకపోతే రానున్న రోజుల్లో సిపిఐ ఆధ్వర్యంలో కార్యాలయాల ముందు ధర్నాలు నిరసనలు తెలుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ ఇతర నాయకులు పాల్గొన్నారు...



# నాయుడుపేట దర్గా వీధిలో పోలీసుల కొరడా

- ఒకే రోజు రూ. 24,800 రుపాయలు జరిమానా
- 'నో పార్కింగ్' ఉల్లంఘనపై కఠిన చర్యలు
- ఆటోలు, కార్లకు దర్గా రోడ్డులో నిషేధం
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎస్సై ఎం.శివశంకర్ స్పెషల్ డ్రైవ్

**ప్రజా సీమ ప్రతినిధి - నాయుడుపేట**

తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని రద్దీగా ఉండే దర్గా వీధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపిన వారి పై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఆదివారం నాయుడుపేట ఎస్సై ఎం. శివశంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది దర్గా వీధిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నో పార్కింగ్ జోన్లలో వాహనాలు నిలిపిన వారి పై కేసులు నమోదు చేసి ఒకే రోజు రూ. 24,800 రూపాయలు జరిమానా విధించారు.

**టూ వీలర్లకు మాత్రమే అనుమతి**

ఈ సందర్భంగా ఎస్సై శివశంకర్ మాట్లాడుతూ దర్గా రోడ్డులో కేటాయించిన పార్కింగ్ స్థలంలో కేవలం ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని స్పష్టం చేశారు. ఆటోలు, కార్లు ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ పార్క్ చేయవద్దని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఇరుకైన దర్గా రోడ్డులో




ఇరువైపులా వాహనాలు నిలపడం వల్ల ఆంధ్ర బ్యాంక్ వీధి, రాజగోపాల్ పురం వీధికి వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఈ చర్యలు తీసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు. పోలీసుల ఈ చర్యను పట్టణ ప్రజలు, వ్యాపారులు స్వాగతిస్తున్నారు. ఇలాంటి స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగించాలని కోరుతున్నారు...

# ‘బూతు మాటలు.. రోతపనుల‘ ఎమ్మెల్యే నానిని వెంటనే అరెస్టు చేయాలి

ఎమ్మెల్యే పులివర్తి నాని చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని వైఎస్ఆర్‌సీపీ డిమాండ్.
ఎస్పీకి ఫిర్యాదు అందించేందుకు శాంతియుతంగా భారీ ర్యాలీగా బయలుదేరిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు.










**ప్రజా సీమ : తిరుపతి.**

తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరకముందే భారీ పోలీసు బలగాలతో అడ్డుకున్న పోలీసులు. ప్రజాస్వామ్యబద్ధంగా వినతిపత్రం ఇచ్చే అవకాశాన్ని కూడా నిరాకరించారని వైఎస్ఆర్‌సీపీ ఆరోపణ ఎస్పీ కార్యాలయం ప్రధాన గేటు వద్దనే బైఠాయించి నిరసన తెలిపిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పోలీసులకు, వైఎస్ఆర్‌సీపీ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట... ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు బూటు కాళ్లతో తొక్కి, లాఠీలతో కొట్టి, ఈడ్చుకెళ్లారని పోలీసులపై వైఎస్ఆర్‌సీపీ ఆరోపణ పలువురు నాయకులు, కార్యకర్తలకు రక్తగాయాలు... చికిత్స కోసం ఆసుపత్రికి తరలింపు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డితో పాటు పలువురు నాయకులను బలవంతంగా అరెస్ట్ అరెస్టు చేసిన నేతలను అనంతరం విడుదల చేసిన పోలీసులుబూతులు మాట్లాడిన ఎమ్మెల్యేపై చర్యలు లేవు... ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రతిపక్షంపైనే పోలీసుల ప్రతాపమా?“ లిలి అంటూ ప్రశ్నించిన వైఎస్ఆర్‌సీపీపోలీసులా...? పసుపు చొక్కాలు వేసుకున్న టీడీపీ కార్యకర్తలా...?“ లిలి అంటూ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహంచట్టం అధికార పార్టీకి ఒకలా... ప్రతిపక్షానికి మరోలా అమలవుతుందా?“ లిలి అంటూ పోలీసుల తీరుపై మండిపాటు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రతిపక్ష గొంతును అణచివేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శ ఎమ్మెల్యే పులివర్తి నానిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వైఎస్ఆర్‌సీపీ హెచ్చరిక

## బెంగాల్లో మూడు రాజ్యసభ స్థానాలకు నోటి ఫికేషన్

### 24న ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల

**కోల్‌కతా,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల రాజీనామాలతో మూడు రాజ్యసభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డ సంగతి తెలిసిందే. ఎంపీలు సుఖేందు శేఖర్ రాయ్, సుస్మితా దేవ్, ప్రకాష్ చిక్ బారైక్ రాజీనామాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. భారత ఎన్నికల సంఘం ఈ మూడు రాజ్యసభ స్థానాలకు సంబంధించి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. జులై 24వ తేదీన మూడు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. జూలై 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. నామినేషన్ల సమర్పణకు జూలై 14 ఆఖరి తేదీ అని పేర్కొంది. ఎన్నికల సంఘం మూడు ఖాళీలను విడివిడిగా పరిగణిస్తూ ప్రత్యేకంగా నోటిఫికేషన్లు జారీ చేసి, పోలింగ్ నిర్వహించనుంది. జులై 24వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. బ్యాలెట్ పేపర్‌పై ఓటు వేయడానికి రిటర్నింగ్ అధికారి ఇచ్చే ప్రత్యేక ఊదా రంగు పెన్ను మాత్రమే వాడాలని, ఇతర పెన్నులు వాడితే ఓటు రద్దవుతుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఇక, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. ఓట్ల లెక్కింపు పూర్తైన వెంటనే ఫలితాలు వెల్లడించనున్నారు.

## హనుమంత వాహనంపై భక్తులను అనుగ్రహించిన శ్రీ సుందరరాజస్వామివారు





### తిరుచానూరులో ఆధ్యాత్మిక వైభవం

### మంగళవారం గరుడ వాహనంపై దివ్య మంగళ విహారం

**ప్రజా సీమ : తిరుచానూరు.**

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ సుందరరాజస్వామివారి అవతార మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి శ్రీ సుందరరాజస్వామివారు హనుమంత వాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో దివ్య మంగళ విహారం చేసి భక్తులకు అభయప్రదమైన దర్శనమిచ్చి అనుగ్రహించారు.

**శాస్త్రోక్తంగా అభిషేకం వైభవంగా ఊంజల్ సేవ**

ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ సుందరరాజస్వామివారికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, చందనం తదితర పవిత్ర ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా మహాభిషేకం నిర్వహించారు.సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించిన అనంతరం, హనుమంత వాహనంపై సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దివ్య దర్శనం కల్పించారు.

**మంగళవారం గరుడ వాహనసేవ**

అవతార మహోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం రాత్రి శ్రీ సుందరరాజస్వామివారు గరుడ వాహనాన్ని అధిరోహించి ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

### ఘనంగా నివాళి అర్పించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జూలై6ప్రజా సీమ ప్రతినిధి**

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం, ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన జీవితం 'ధైర్యానికి, మాతృభూమి పట్ల అచంచలమైన నిబద్ధతకు కాలాతీత ఉదాహరణ' అని కొనియాడారు. ప్రధాని మోదీ తన బ్లాగ్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలను ప్రస్తావించారు. శ్యామా ప్రసాద్ సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, దేశసేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని చెప్పారు. వలస పాలన, విభజన రాజకీయాలు, సామాజిక సవాళ్ల వంటి అంశాలపై ఆయన రాజీపడకుండా పోరాడారని గుర్తు చేశారు. దేశ సమైక్యతే శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజాజీవితానికి మూల సూత్రమని ప్రధాని అన్నారు. దేశ విభజన సమయంలో పశ్చిమ బెంగాల్ భారతదేశంలోనే కొనసాగడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అనంతరం జమ్మూ కశ్మీర్ సంపూర్ణ విలీనానికి కృషి చేస్తూ నిర్బంధంలోనే ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. మ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఏలను 2019లో తమ ప్రభుత్వం రద్దు చేసిందని, అది శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు నిజమైన నివాళి అని ప్రధాని మోదీ అభివర్ణించారు

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma